క్లుప్తంగా

నేడు డోకిశీలలో ఉచిత వైద్యశిబిరం

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీలలో పార్వతీపురం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో డోకిశీల పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రూరల్ ఎస్సై సంతోషి మంగళవారం తెలిపారు. ఈ శిబిరానికి విశాఖపట్నం నుంచి పేరుగాంచిన ప్రైవేట్ ఆస్పత్రి నుంచి వైద్యులు వస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం ప్రారంభించనున్నట్లు చెప్పారు. పరిసర గ్రామాల గిరిజనులు, ప్రజలు ఉచిత వైద్యశిబిరంలో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని ఆమె కోరారు.

చిన్నారుల్లో మానసిక, శారీరక అభివృద్ధి మెరుగుపడాలి



మాట్లాడుతున్న డీఈఓ తిరుపతినాయుడు

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్లు రాజశ్రీ, లీలావతి, ఉమా మహేశ్వరరావు, వెంకటరమణ, జగన్‌మోహన్‌రావులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని స్కూల్ ఎడ్యుకేషన్, ఉమెన్ డెవలప్‌మెంట్ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లల మానసిక, శారీరక అభివృద్ధి మెరుగు పరిచేందుకు, అలాగే అంగన్వాడీలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రథమ సంస్థ సహకారంతో ప్రభుత్వం నిర్వహిస్తోందని చెప్పారు. కార్యక్రమాన్ని డీఈఓ ఎస్. తిరుపతినాయుడు పరిశీలించారు. ఎంఈఓలు సత్యనారాయణ, శ్యామ్ సుందర్, సీడీపీఓ బి. అనంతలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

50 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి అరుణ దీపిక

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామంలో 50మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించారు. సాయిరాం మందిరం వద్ద నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు ఆధ్వర్యంలో ఎం అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో ఉచిత నేత్ర వైద్యపరీక్షలు, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్య బృందం తనిఖీలు చేశారు. శిబిరానికి హాజరైన వారిలో 18మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు జెమ్స్ ఆస్పత్రి వైద్యురాలు అరుణ దీపిక తెలిపారు. వారికి కంటి ఆపరేషన్లు చేయించి తిరిగి పెదపెంకి గ్రామానికి తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, క్యాంపు కోఆర్డినేటర్ వెంకటరమణ, జి.రామారావు, జి.సాధు, జి.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణను వినియోగించు కోవాలి



జ్యోతిని వెలిగిస్తున్న ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ

సీతానగరం: జాతీయ విద్యావిధానంలో భాగంగా నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ తరగతులను అంగన్వాడీ సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు జి.సూరిదేముడు, ఎం.వెంకట రమణ కోరారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట కేజీబీవీ విద్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో బాలల సంరక్షణ, విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అంగన్వాడీ, ఆశ వర్కర్ల సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ దోహద పడుతుందన్నారు.కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు పి కూర్మినాయుడు, సీహెచ్ గణపతి, కేజీబీవీ ప్రిన్సిపాల్ జె.సంధ్య పాల్గొన్నారు.

పోస్టల్ ప్రైవేటీకరణ నిర్ణయం విరమించుకోవాలి

పార్వతీపురంటౌన్: పోస్టల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని పోస్టల్ పీజేసీఏ యూనియన్ నాయకుడు జె.రవీంద్ర నాథ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం హెడ్ పోస్టాఫీసు వద్ద ఉద్యోగులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టాఫీసు చట్టం-2023ను తక్షణమే ఉపసంహరించుకోవాలి, ఏఐపీఈయూజీఆర్-సీ,ఎన్ఎఫ్‌పీఈ సంఘాల గుర్తింపు రద్దు ఉత్తర్వులపై జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్‌పీఎస్, యూపీఎస్ కాకుండా అందరికీ ఓపీఎస్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తాడ్డి వేణుగోపాలరావు, బి.ఉమాశంకర్, ఎం.అప్పారావు, గౌరీశంకర్రావు పాల్గొన్నారు.

దర్జీ బతుకుల్లో దర్జా మాయం

- రెడీమేడ్ రాకతో టైలర్లకు కష్టాలు
- గత ప్రభుత్వ హయాంలో జగనన్న చేదోడుతో భరోసా
- పట్టించుకోని నేటి ప్రభుత్వం



బలిజిపేటలో టైలరింగ్ షాపులో బట్టలు కత్తిరిస్తున్న దర్జీ

బలిజిపేట:

దుస్తులు మనిషికి అందం, హుందాతనం, విలువ, ఆకర్షణ కలిగిస్తాయి. వస్త్రానికి ఆకృతినిచ్చి కళాత్మకంగా తీర్చిదిద్దేది దర్జీలే. రెడీమేడ్ వస్త్రాలను దర్జీలే కుడతారు కానీ నేరుగా దర్జీవద్దకు వెళ్లి కొలతలు ఇచ్చి కుట్టించుకునే వస్త్రాలను వేసుకుంటే మరో అనుభూతి కలుగుతుంది. ఎందుకంటే మంచి నాణ్యమైన, ఇష్టమైన రంగు, రంగుల వస్త్రాన్ని ఎంచుకుని దానిని అవసరమైనంత కొలతలు తీసుకుని దర్జీకి ఇచ్చి కుట్టిస్తాం కనుక దానిలో ఉండే అనుభూతిని ఆస్వాదించడం మొదటి నుంచి వస్తున్న ఆనందం. కాలక్రమేణా మార్కెట్‌లోకి పలు ఫ్యాషన్లు, డిజైన్లతో పాటు రెడీమేడ్ దుస్తుల రాకతో టైలర్లకు ఉపాధి కరువైంది. కులవృత్తినే నమ్ముకున్న వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. గతంలో పండగలు, శుభకార్యాలు, ఇతరత్రా ఫంక్షన్ల సమయంలో టైలర్లకు చేతినిండా పని ఉండేది. కొత్త బట్టలు కుట్టించుకునేందుకు టైలర్ల వద్దకు క్యూకట్టేవారు. రెడీమేడ్ దుస్తుల రాకతో టైలర్ల జీవితాలు అగమ్య గోచరంగా మారాయి. యువత, మధ్య వయస్సు వారు ఎక్కువ భాగం టీషర్టులు, జీన్స్‌ప్యాంట్లు ధరిస్తున్నారు. మిగిలిన కొంతమంది మాత్రమే టైలర్లను ఆశ్రయించి దుస్తులు కట్టించుకుంటున్నారు. ప్రస్తుత రోజుల్లో పండగల సమయంలో సైతం పెద్దగా పనులు లేని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు పండగల సమయంలో ఇంట్లో ఉండే అందరూ బట్టలు తెచ్చుకుని కుట్టించుకునేవారు. టైలర్లకు అన్నం తినేందుకు సమయం ఉండేది కాదు. పండగ ముగిసినప్పటికీ కొంత పని ఉండేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

వెలవెలబోతున్న టైలర్ షాపులు

బట్టలు కుట్టించుకునే జనాలతో రద్దీగా ఉండే టైలర్ షాపులు నేడు వెలవెలబోతున్నాయి. షాపుకు ఎవరు వస్తారో అని ఎదురుచూసే పరిస్థితులు ఏర్పడ్డాయని దర్జీలు చెబుతున్నారు. చాలామంది దర్జీలు ఆయిల్ మిషన్‌లను పక్కకు పెట్టి అధునాతన విద్యుత్‌తో పనిచేసే మిషన్‌లను వినియోగిస్తున్నారు. పండగ వచ్చిందంటే షాపునిండా చిన్నా, పెద్దలతో కలిపి రకరకాల పనులు చేసిన వారితో షాపులు ఎంతో నిండుగా కనిపించేవి. ఇప్పుడు పనులు సరిగ్గా లేక గది అద్దె, విద్యుత్ చార్జీలకు సరిపడా పని రావడం లేదని చెబుతున్నారు. చాలామంది వృత్తిని వదిలేసి ఇతర పనులకు వెళ్లిపోతున్నారు.

పనిచేసేవారు లేకనే:



ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా దర్జీ పనిచేసేవారు కరువయ్యారు. రెడీమేడ్ దుస్తుల ప్రాబల్యం పెరిగింది. షాపులో పనిచేసేందుకు మనుషులు కరువై పని కష్టమవుతోంది. దీంతో కుట్టించుకునే వారు వచ్చినా మేము కుట్టి ఇవ్వలేకపోతున్నాం. పనిచేసినా గిట్టుబాటు అవడం లేదు. జీవనోపాధి కష్టంగా ఉంది.

– రమేష్, టైలర్, బలిజిపేట

ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం:

కష్టాల్లో నలిగిపోతున్న టైలర్లను త వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంది. టైలర్ల కోసం జగనన్న చేదోడు అనే పథకం అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించింది. ప్రతి టైలర్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది. ఈ పథకం కొంతమేర వారి జీవనోపాధికి వెసులుబాటు కల్పించింది. ప్రతి విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫాం క్లాత్‌ను ప్రభుత్వం అందించి, కుట్టు కూలీ డబ్బులను తల్లుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చేది. యూనిఫాం ఇవ్వకుండా క్లాత్ మాత్రమే ఇవ్వడంతో టైలర్లకు చాలా వరకు పని లభించింది. ఒక రకంగా వారికి పని ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని దర్జీలు వాపోతున్నారు.

రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



బలిజిపేటలో తహసీల్దార్, సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

బలిజిపేట: రెవెన్యూ సదస్సులు, గ్రామసభల్లో వచ్చిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఈ మేరకు బలిజిపేట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పద్ధతి ప్రకారం పరిష్కరించాలని సూచించారు. ప్రతి సమస్య లేదా ఫిర్యాదుపై ఎండార్స్‌మెంట్ వేయాలని, సరైన శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. మ్యుటేషన్లు, సబ్‌డివిజన్స్, మొబైల్ లింకింగ్ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం శివరాంపురం గ్రామాన్ని సందర్శించారు. రీసర్వే ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా పక్కాగా చేపట్టాలంటూ క్షేత్రస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. తొలుత రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నకుమారి, సర్వే డీటీ రమేష్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ–సర్వే పనులు కచ్చితత్వంతో ఉండాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సర్వేపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

సీతానగరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వే పనులు పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామంలో నిర్వహిస్తున్న రీ–సర్వే పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మ్యాప్‌లో గ్రామ భూ విస్తీర్ణం, ఇప్పటివరకు పూర్తి చేసిన సర్వే..ఇంకా చేపట్టనున్న సర్వే వివరాలను మండల సర్వేయర్ చంద్రరావును అడిగి తెలుసుకున్నారు. భూమి కొలతలు వేసేముందు రైతులకు ఫామ్‌నంబర్ 19 నోటీసులు ఇస్తున్నదీ లేనిది, అడంగల్‌లో రైతుల పేరు మీద ఉన్న భూమి విస్తీర్ణానికి కచ్చితంగా కొలతలు వేస్తున్నారా? లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో కచ్చితమైన హద్దులను నిర్ణయించి రైతులకు భూమిని అప్పగించాలని సూచించారు. నోటీసులు తీసుకునే ముందు అందుబాటులో లేని రైతులకు, వాట్సాప్ ద్వారా నోటీసులు జారీ చేయాలని చెప్పారు. రీ–సర్వే కొలతల్లో తేడా లేకుండా రైతులు చూసుకోవాలని కోరారు. రీ–సర్వే ఎప్పటిలోగా పూర్తి చేస్తారని తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ను కలెక్టర్ ప్రశ్నించగా ఈనెల 26 నాటికి సర్వే ప్రక్రియ పూర్తి కానుందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 450ఎకరాలు సర్వే పూర్తి కాక మరో 430 ఎకరాల్లో రీ–సర్వే పని పూర్తి కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఉపతహసీల్దార్ ఎ.ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ కుమార్‌వర్మ, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, వీఎస్ఏ మన్మథరావు, వీఆర్‌ఓ కిరణ్, సర్వేయర్ల బృందం పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ ట్రైనింగ్ సద్వినియోగం చేసుకోండి



సూచనలు ఇస్తున్న ఎంఈఓ-1 సామల సింహాచలం

బలిజిపేట: జ్ఞానజ్యోతి ఎఫ్‌ఎల్ఎస్ శిక్షణను అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ-1 సామల సింహాచలం అన్నారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అంగన్వాడీ కేంద్రాలు పాఠశాలలతో అనుసంధానం కానున్నందున గతంలో పాఠశాల ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణ విధంగానే మీకు ఇవ్వడం జరుగుతోందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పొందిన రిసోర్సు పర్సన్స్ వాటిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఏవిధంగా విద్యాబోధన సాధించాలనే దానిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్రాలకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బోధించే విధానంపై శిక్షణ అందించనున్నామన్నారు. ఈ శిక్షణను వినియోగించుకుని మంచి విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలి



సాలూరులో నిర్వహిస్తున్న, క్యాండిల్ ర్యాలీ

సాలూరు: అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి చేసిన ప్రేమోన్మాదిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్ఫూర్తి మహిళా మండలి నాయకురాలు బలగ రాధ డిమాండ్ చేశారు. యువతిపై ప్రేమోన్మాది చేసిన యాసిడ్ దాడికి నిరసనగా మంగళవారం సాలూరు పట్టణంలో క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఎక్కడ చూసినా మహిళలపై లైంగికదాడులు, అత్యాచారాలు, హత్యలు ఎక్కువైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై ప్రభుత్వం స్పందించి మహిళలపై దుశ్చర్యలకు పాల్పడిన దుర్మార్గులను కఠినంగా శిక్షించి మహిళలకు న్యాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో పలువురు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ దర్శనంతో పులకించిన భక్తులు



క్యూలో భక్తులు



శంబర పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాలుగవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే సుదూర ప్రాంతాల భక్తులు వేలాదిగా చదురుగుడి, వనంగుడికి చేరుకోవడంతో ఆలయాలు కిటకిటలాడాయి. చదురుగుడి ఆలయం వద్ద క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఈవో వీవీ సూర్యనారాయణ, సీఐ రామకష్ణ, ఎస్సై వెంకటరమణలు దగ్గరుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. గోముఖి నదీ తీరాన భక్తులు అమ్మవారికి కోళ్లను మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం వనంగుడిలోని పోలమాంబ అమ్మవారిని దర్శించుకుని ఆలయం వెనుకన ఉన్న వేప చెట్టుకు భక్తులు పూజలు నిర్వహించారు.

వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్ఓ ఎస్. భాస్కరరావు

పార్వతీపురంటౌన్: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. ఈ మేరకు పట్టణంలోని 16వ వార్డులో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, వైద్యసిబ్బందితో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు చేపట్టిన హెల్త్ స్క్రీనింగ్ వివరాలపై ఆరా తీశారు. విద్యార్థుల హిమోగ్లోబిన్ పరీక్షల నివేదికలను రికార్డులో తనిఖీ చేసి గత నెలల నివేదికలతో పోల్చి చూశారు. భవిత కార్డుల్లో నమోదు చేసిన వివరాలు పరిశీలించారు. హాస్టల్‌లో సిక్ రూమ్, సిక్ రిజిస్టర్ పక్కగా నిర్వహించాలని, విద్యార్థుల్లో ఏ చిన్న అనారోగ్య సమస్య గుర్తించినా తక్షణమే స్పందించాలని సూచిస్తూ పలు ఆరోగ్య సూచనలు చేశారు. ఆయన వెంట ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు తదితరులు ఉన్నారు.

కొత్త రేషన్ కార్డుల జారీ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న, సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ

పార్వతీపురం టౌన్: కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టాలని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన వివాహ దంపతులకు రేషన్‌కార్డు నమోదు గుదిబండగా మారుతోందన్నారు. కూటమి ప్రభుత్వ ఏర్పడిన వెంటనే జూలై, ఆగస్టు నెలల్లో రేషన్ కార్డులు మంజూరు చేస్తావని ప్రకటించినా ఇప్పటికీ పురోగతి లేదని, కొత్త కార్డులు చేర్పులు మార్పులకు వైఎస్సార్‌సీపీ హయంలోనే 3.36 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికార యంత్రాంగం నివేదికలు చెబుతున్నాయని, ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అవకాశం కల్పిస్తే కొత్తగా కొన్ని లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి నిరసన



బలిజిపేటలో నిరసన తెలుపుతున్న విలేకరులు, ప్రజా సంఘాల నాయకులు

సీతానగరం: ప్రజాశక్తి దినపత్రిక మక్కువ విలేకరిపై టీడీపీ నాయకుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ సీతానగరం మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల మద్దతుతో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ పాత్రికేయులపై కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దాడులు పెరుగుతున్నాయని, దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఎవరికి ఏ అన్యాయం జరిగినా ప్రజా సంఘాలు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మేరకు విలేకరిపై టీడీపీ నాయకుడు దాడి చేయడాన్ని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాత్రికేయులకు సంఘీభావం తెలియజేస్తూ ధర్నా చేశారు. తక్షణమే టీడీపీ నాయకుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కాపాడండి



తహసీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బలిజిపేట: ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలుచేయాలి. మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు జి.వేణుగోపాలనాయుడిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బలిజిపేటలో మండల విలేకరులు, ప్రజాసంఘాలు మంగళవారం నిరసనకు దిగారు. ఈ మేరకు మండలకేంద్రంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై వార్త రాసినందుకు మక్కువ మండల ప్రజాశక్తి విలేకరిపై ఆ మండల టీడీపీ అధ్యక్షుడు జి.వేణుగోపాలనాయుడు వెంగంపేట కాశీపట్నం మార్గమధ్యంలో దాడిచేసి నా జోలికి వచ్చినా, మా నాయకులు, మినిస్టర్ గురించి రాసినా నీ ఇంటికొచ్చి చంపేస్తామని బెదిరించి దాడిచేయడం అమానుషమన్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని, పత్రికా స్వేచ్ఛను ఖూనీ చేయడమేనని తెలిపారు. కార్యక్రమంలో మండల విలేకరుల బృందం, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సుతాపల్లి రాముపై అట్రాసిటి కేసు నమోదుచేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

సాలూరు: మండలంలోని కరాసవలసలో దళితుల భూమి ఆక్రమించి ,వారిపై దాడిచేయించిన పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ సుతాపల్లి రాముపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టి అరెస్ట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళితులు సాగుచేస్తున్న భూములను కాజేయాలని రాము దురుద్దేశంతో దళితులపై గిరిజనులతో దౌర్జన్యం చేయించి కొట్టించారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే తహసీల్దార్, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా సమస్య పరిష్కరిస్తామని తెలిపిన అధికారులు నేటికీ పరిష్కరించలేదన్నారు. రాము ఆక్రమించిన ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. భూములు సాగుచేస్తున్న దళితులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరిస్తూ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సుందరరావు, సింహాచలం, బోడయ్య తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడికి సీపీఎం ఖండన



నిరసన తెలుపుతున్న పట్టణ సీపీఎం కార్యదర్శి గొర్లి వెంకటరమణ

పార్వతీపురంటౌన్: మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడిని ఖండిస్తున్నామని సీపీఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలివద్ద గల మహాత్మాగాంధీ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలుచేయండి. టీడీపీ మండల అధ్యక్షుడు గుల్లవేణుగోపాలనాయుడిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిబంధనలపై వార్త రాసినందుకు ప్రజాశక్తి మక్కువ మండల విలేకరి మల్యాడరామారావును టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల నాయుడు చంపేస్తామని బెదిరించడం దాడి చేయడం అరాచకమన్నారు. కార్యక్రమంలో పట్టణ సీపీఎం నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్, సభ్యులు ముట్నూరు వెంకటరమణ ప్రజలు పాల్గొన్నారు.